'ఆంటీ— అమ్మా ఆంటీ.'

పరుగిడుతున్న ప్రకృతితో తనూ పందెం వేసి, ఆ పచ్చని పైరులలో విహరించే విహంగము తానై లీనమయిన సుజాత ఒక్కసారి వులిక్కిపడింది. తన నెవరో లాగుతున్నటులయి యిటు తిరిగింది.

తిరిగి అవే పలుకులు, తేనెలొలికే తీయని మాటలు.

'ఆంటీ అమ్మా...ఆంటీ.'

తనదగ్గర నుంచున్న పాపనుండి చూపులు మరల్చింది సుజాత.

తన కెదురుసీటులో కూర్చున్న దంపతులను, వారి చేతులలో ఆరముగ్గిన జామపండులా వున్న ఆర్నెల్ల బాబుని, తన దగ్గర నుంచుని, తననే తదేకంగా పరీక్షిస్తున్న మూడేళ్ళ ముచ్చటైన పాపను మార్చి మార్చి చూసింది.

పాపకు కొత్త లేదు గాబోలు. నవ్వుతూ తన చేతులలోకి వచ్చిన పాపను ముద్దిడుకొని ఒళ్ళో కూర్చోబెట్టుకుంది సుజాత.

లాలనగా అడిగింది 'నీ పేరేటమ్మా?

'నేను అమ్మనుగాను. నాపేరు అలువ..' గోముగా సమాధానమిచ్చి తల్లివైపు తిరిగింది పాప.

పాప సమాధానానికి సుజాత నవ్వుకుంది. పాపకింకా కొన్ని అక్షరాలు నోరు తిరగ లేదనుకుంది.

సుజాత ఒక్కసారి పెట్టెనంతా కలయజూసింది. తను కాకినాడలో యెక్కినపుడు వీరిని చూడలేదు. మరెక్కడ యెక్కినట్లు? సుజాత ఆలోచించింది. ఓహో...అనపర్తి స్టేషన్‌లో యెక్కినట్లున్నారు.

సుజాత హేండ్‌బాగులో నుండి చాకలేట్లు తీసి పాపచేతిలో పెట్టింది. అందులో వస్తువులొక్కొక్కటే పాప చక్కబెట్ట సాగింది.

'మీరెక్కడికండీ ?' ప్రశ్నించింది సుజాత.

'మద్రాసుకు', పాప తల్లి జవాబు.

నీళ్ళు నిండిన కళ్ళతో పాపను హృదయానికి హత్తుకుంది సుజాత. ప్రకృతి, పిల్లలు; వీళ్ళిద్దరూ భగవంతునికి మారుచిహ్నాలు. ఈ రెండిటి సన్నిధిలో తనకు లభించే మనశ్శాంతి మరెచ్చటా లభించదు. ఎవరూ తగ్గించలేని తన మనోవ్యథ, గుండెబరువు వీరి సమక్షములో మాయమయి మనస్సు దూదిపింజెలా తేలిపోతుంది.



తనూ ఆ పిల్లలలో ఒక పిల్లగా ఆ ప్రకృతిలో ఒక భాగంగా మారిపోతే బాగుండుననిపిస్తుంది సుజాతకు.

'మీదేవూరండీ?'

'కాకినాడ.'

'ఏం చేస్తున్నారక్కడ?'

'స్టెనో'గా యాంత్రికంగా సమాధానా మిచ్చింది సుజాత.

తన వూహాకందని వేగంతో పరిగెడుతున్న చెట్లు చేమలను చూస్తూ కిటికీలో నుండి చేతులటూ యిటూ వూపుతూ ఆనందించసాగింది పాప.

కదులుతున్న కన్నీటిపొరలలో కలలా మిగిలిన గత జీవితం కరుగసాగింది. క్రమముగా గత జీవితపు స్మృతులలోకి జారిపోయింది.

* * *

రామనాథంగారికి ముగ్గురు కొడుకులు, యిద్దరు కూతుళ్ళు. అందరిలోనూ సుజాత పెద్దది. రామనాథంగారిది మధ్యతరగతి సంసారము. తండ్రినుండి సంక్రమించిన రెండెకరాల మాగాణివలన యెట్టి యిబ్బందులు లేకుండా సంసారము గడచిపోతూంది.

ఆ రోజులలోనే పి. యు. సి. ప్యాసైన సుజాతను బుద్ధిమంతుడు, స్థితిపరుడను కున్న హనుమంతుకిచ్చి వివాహము చేయటం జరిగింది. స్థితిపరుడు, ఉద్యోగవంతుడైన అల్లుడు తమిచ్చే చిన్న మొత్తము కట్నానికి లభిస్తున్నాడని మురిసిపోయిన తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులకు తెలిపే అవకాశంలేకుండా దగ్గర ముహూర్తానికి గుళ్ళో పెళ్ళి అతి సామాన్యముగా జరిపించేసారు.

తల్లిదండ్రుల యాశలకు గొడ్డలిపెట్టు, సుజాత జీవితములోకి కష్టాలపు తొలి మెట్టు ఒకేసారి ప్రవేశించాయి. పరిణతి చెందీ చెందని వయస్సులో, పరిపక్వముకాని మనస్సుతో భర్తయింట కాలుమోపిన సుజాత వుప్పెన ముంచెత్తినట్లుగా అదిరిపడింది. అచ్చట పడని కష్టము, అతనికిలేని వ్యసనం లేదు. పుట్టింట్లో పువ్వులా పెరిగిన పిల్ల, అత్తింట అన్ని అవస్థలు ననుభవిస్తుంటే తల్లిదండ్రులు గిలగిల్లాడారు.

ఇంతలో 'పుండుమీద కారం చల్లినట్లుగా' బాధించినదేమిటంటే హనుమంతుకు సుజాతకు ముందే యగ్నిసాక్షిగా పెళ్ళాడిన భార్య, ఆ భార్యవలన కలిగిన పాప వున్నారన్న సంగతి. ఆవిడగారు యితని వ్యసనాలు భరించలేక పుట్టింటికి వెళ్ళినదని యిప్పుడు యితను రెండో పెళ్ళిచేసుకున్నట్లు తెలిసి కోర్టులో దావావేస్తుందని, వేసిందని తెలిసినది.

హనుమంతు రెండో పెళ్ళిచేసుకున్నట్లు ఋజువైతే వచ్చే కష్టనష్టాలు. ఋజువు కాకపోతే వచ్చేది తెలుసుకున్న సుజాత నివ్వెరపోయింది. ఎవరికీ తెలియకుండా లలిత (హనుమంతు మొదటి భార్య) నొకసారి కలుసుకుంది. తనకంటే యిన్నింటిలోనూ మిన్నయైన లలితనెందుకు భర్త నిరాదరించారో సుజాత కర్థంకాలేదు.

హనుమంతు రెండో పెళ్ళిగా సుజాతను చేసుకున్నాడని కోర్టులో నిరూపించుట తన కెంత తేలికో, అదేసంగతి ఋజువుచేయుట సుజాత కెంత కష్టమో లలిత వివరించి, కనీసం తనకోసం కాకపోయినా పాప మొహం చూచైనా ఆ గుట్టు తన పరంచేసి వెళ్ళిపొమ్మని కోరింది. ఆమె ఔదార్యానికి విస్తుపోయింది సుజాత. భర్తంటే భయమేకాని, ప్రేమా భక్తీ ఎరుగని సుజాత, సంసారములో నరకమునే చూచిన సుజాత అందుకు ఒప్పుకొని దానికితగిన విధముగా పత్రములను వ్రాసియిచ్చినది. అందుకు ప్రతిగా తనపేరు ఎప్పటూ ఎత్తరాదన్న షరతును విధించింది.

భయం భయంగాను, బిక్కు బిక్కుమంటూనే తనుచేసిన ఘనకార్యాన్ని తండ్రికి వివరించినది సుజాత. తండ్రి తెల్లబోయాడు. దినమొక గండముగానున్న కూతురి కాపరం వున్నా ఒకటే లేకున్నా ఒకటేనని భావించిన తల్లి, యికముందైనా కూతురు తన కళ్ళముందు సుఖముగా వుంటుందని సంతోషించినది. పెళ్ళికి శుభలేఖలు లేవు. పెళ్ళి చూడవచ్చిన బంధువులు, స్నేహితుల లేరు. కాపరం చేస్తుంటే చూచిన లోకులు నిజం చెప్పటానికి ముందుకు రాలేదు. పెళ్ళి కుదిర్చిన పెద్దమనుషుల నడిగితే 'అలా నిలదీస్తావేమయ్యా? అటు యిటు అంతా పెళ్ళి కుదర్చమన్నారు కుదిర్చాము. మిగతా వివరాలు మాకు మాత్రం యేం తెలుసు' నంటూ తప్పుకున్నారు. అన్ని వైపులా అనేకవేలమైళ్ళ పొడవున విస్తరించిన ముళ్ళబాటను విస్మరిస్తూ తనే ముందుకు నడవసాగింది. లలిత యింటిని లలిత కప్పగించి పుట్టింటి కొచ్చింది సుజాత. వివాహమయిన వూరునుండి రామనాథంగార్కి బదిలీ కావడంతో సుజాత వైవాహిక జీవితానికక్కడే సమాధి కట్టబడింది.

విధివంచితయైన సుజాత దైవంయొక్క సహాయంతో తిరిగి జీవితాన్ని పునరుద్ధరించుకోవటంలో తప్పు లేదు. కన్నెపిల్లలా కాలేజీలో చేరిన సుజాత పట్టుదలతో బి. ఏ., టైపు పూర్తి చేయగలిగింది. టైపిస్టుగా వుద్యోగంలో జాయినయింది.

* * *

ఇంట్లో తనపై జరుగుతున్న ప్రేమాభిమానాలు, తను చేసే ప్రతి పని మీదా విధించబడే ఆంక్షలు సుజాతను కలవరపరచసాగాయి.

సుజాతకు సోషియల్‌గా మూవ్ అవటం చాలా యిష్టం. సుజాత అంత సోషల్‌గాను అందరితోనూ వుంటుంది. రెండవది సుజాతకు పిల్లలంటే పిచ్చిప్రేమ. ఇవి రెండూ తల్లి కోపానికి కారణమవసాగాయి. ఈ రెండలవాట్లు చిన్నప్పటినుండి తనకున్నవే. మరి తల్లి మధ్యలో కొనసాగించుకోవలసిన అవసరమేమొచ్చిందో సుజాత కర్థంకాలేదు. వూళ్ళోవాళ్ళ పిల్లలను, స్నేహితుల పిల్లలను, వారి చిన్ని తమ్ముళ్ళను, చెల్లాయిలను వెంటేసుకుని తిరిగేది. ఆ చిన్న పిల్లలలో తనూ ఒక పిల్లయై కేరింతలాడేది. వారి సన్నిధిలో ఏదో పెన్నిధి లభించినంతగా వూరట చెందేది. తనకు యీ చిన్న పిల్లలపైగల మమకారము తననెరిగిన వారందరికీ తెలిసిన విషయమే. 'ఆ పిల్లలెవరని యడిగితే యేమి సమాధానం చెప్తావు? వారికి నీకూగల సంబంధమేమిటంటే యేం జవాబు చెప్తావు? లోకులేమనుకుంటారని...' వెనుకనుండి తల్లి సాధిస్తూనే వుండేది.

తల్లి మాటలలో గల వ్యంగానికి, ద్వంద్వార్థానికి సుజాత కాస్సేపు నివ్వెరపడినా తరవాత కుళ్ళి కుళ్ళి యేడ్చేది. తను ఒకవిధంగా సంపాదించలేని తృప్తి నింకొకలా చూచి ఎలా అనందిస్తుందో తల్లికెలా తెలిసేది. తన కాపరం పాయి

ఐదేళ్ళుగావచ్చింది. ఏనాడైనా మన మూర్తిగా తన పెళ్ళిచేయాలని తల్లిదండ్రులు సంకల్పించారా? తనకూ యిల్లాలు కావాలని, మాతృమూర్తి కావాలన్న కలలు లేవా? లేక తన ఆశలర్థం చేసుకొనే శక్తి వీరికి లేదా? విధి ప్రేరేపణగా జరిగి, తిరిగి తనకు శాశ్వతముగా దూరమైన ఆ ఏడాది వైవాహిక జీవిత ...తో జీవితాంతము తృప్తి చెందాలా? జంటలు జంటలుగా సాగిపోతున్న దంపతులను, అందమైన పసిపాపలను చూచినప్పుడు తనెలా ఫీలవుతున్నదీ వీరికి చెప్పేదెలా? తననూ నిర్లక్ష్యం చేస్తున్న తల్లిదండ్రులమీద సుజాత కెనలేని కోపం వచ్చింది. అయినా తండ్రి తనను ఎం. ఎ. చదువమన్నప్పుడు 'నాన్నా! ఎం.ఏ. చదివితే అంతకంటె పెద్ద వరుడుని తీసుకురావాలి. అయినా నా చదువుకయ్యే ఖర్చును పెళ్ళికి వాడవచ్చుగా'నని తండ్రితోనన్నది. తన సమాధానానికి తల్లిదండ్రి నిర్ఘాంతపోవటం తనెరుగనిది కాదు. తన కాళ్ళమీద తను నిలబడాలన్న దీక్షతో తను వుద్యోగములో చేరింది. ఏనాడూ సుజాత ఇంకొకరిని చూచి యీసూయపడి ఎరుగదు. కాని తన కళ్ళ యెదుటే తమ్ముడి పెళ్ళి ప్రయత్నాలు జరుగుతుంటే నిజంగానే యీర్ష్య బయలుదేరింది. తను షార్ట్ హేండ్ పాసయినందుకు ఆ రోజు చాలా సంతోషించినది. 'స్టెనో'గా కాకినాడలో జాయినయింది, ఆ విధంగానైనా తన మనస్సులోని యీర్ష్యనూ యీసును దూరంగా నెట్టివేయవచ్చని. ఇంతలోనే లలిత తనకు మూడవ సంతానముగా బాబు పుట్టాడని ఒకసారి రమ్మనమని వ్రాసింది. కాస్త మార్పు వస్తుంది గదాయని సుజాత గుంటూరు బయలుదేరింది.

* * *

కంట్లో నలుసుపడి ఏడుస్తున్న అరుణతో యీ లోకంలోకి వచ్చింది సుజాత. నలక వూదేసి కాస్సేపు ఆడించింది. మెల్లిగా నిద్రలోకి జారిపోయింది అరుణ. అరుణను బెర్తు మీద పడుకోబెట్టి బాబునాడించింది సుజాత. విజయవాడ తరువాత చెప్పుకోదగ్గ పెద్ద స్టేషనేమీ లేదు విజయవాడ గుంటూరు మధ్య. అరుణ నిదురలేవలేదు. ఆ దంపతులవద్ద సెలవు తీసుకొని దిగిపోయింది గుంటూరులో సుజాత.

హనుమంతు చాలావరకు వ్యసనాలను విడిచిపెట్టినట్లే. అత్తగారు, ఆడపడచుల అహంకారాన్ని లలిత చాలావరకు అణచివేసిందనే చెప్పుకోవాలి. ఇంతకుమించి మార్పేమీ లేదు. ముగ్గురు పిల్లలతో ముచ్చటైన సంసారము.

* * *

ఎం. ఏ. లో ఉత్తీర్ణురాలయి విజయవాడలో జూనియర్ లెక్చరరుగా పని చేస్తున్న సుజాత తీయని కోర్కెతీరని కోర్కెగానే మిగిలిపోయింది. ప్రైవేటుగా కట్టి ఎమ్. ఏ. ప్యాసయ్యింది. జీవితానికొక గౌరవప్రదమైన హోదా తెచ్చుకుంది, కాని ఏదో వెలితి, ఏమిటో బాధ...తనేం పాపంచేసింది. తన జీవితం యెందుకిలా తయారయింది. తనకు 'నా సంసారము, నా యిల్లు, నా పిల్లలు' అని గర్వంగా చెప్పుకొనే యర్హత లేదా? భర్త ప్రేమకు, పిల్లల ఆనందానికి, అత్తామామల యాదరణకు, ఆడపడుచుల, తోడికోడళ్ళ గౌరవానికి, మరుదుల మన్ననలకు నోచుకోలేదా? 'నువ్వెంత అదృష్టవంతురాలివి సుజాతా...నీకే బాదరబందీలు, బాధలు లేవ'నేవారిని తన్నాలనిపిస్తుంది సుజాతకు. తను కోల్పోయిన దాని విలువ యెంతో వారికేమి తెలుసు. ఒకప్పుడు భర్తను, కాపురాన్ని అసహ్యించుకొన్నమాట నిజమే. ఈ రోజుకైనా అటువంటి భర్త, అటువంటి సంసారము తనకే గాదు—యే స్త్రీకి కూడా వద్దంటుంది. ఈనాడు దాంపత్య జీవితములోని విలువ, మధురము, అందులోని ఆదరణ అన్నీ కావాలని మనసా వాచా కోరుకుంటుంది. విధి లీలలు విచిత్రము. తను వద్దనుకున్నప్పుడు బలవంతముగా పెళ్ళి జరిగిపోయింది. కాని యీనాడు తను యింత బలీయంగా కోరుకున్నా జరుగుటలేదు. తనకు యిల్లాలయే యోగ్యతా, మాతృమూర్తి కాబోయే అర్హతా లేదనే భావం శూలంపోటులా తననెలా బాధిస్తుందో లోకానికి వివరించటమెలా? తమ్ముడి పెళ్ళి జరిగిపోయింది. చెల్లెలి పెళ్ళి వచ్చేనెలలో. తల్లిదండ్రులంటే ఒక విధమైన నిర్లక్ష్యం, విముఖత యేర్పడ్డాయి సుజాతకు. హృదయావేదన తగ్గించుకోవటానికి తాళంవేసి బయటకు వచ్చింది. తన నెవరో పిలుస్తున్నట్లయి వెనక్కు తిరిగింది.

మమతా ట్యుటోరియల్ కాలేజి ప్రిన్సిపాలు మోహనరావుగారు సుజాతను సాదరంగా లోపలికి ఆహ్వానించారు. వారి కాలేజీలో కొన్ని నెలలు పార్టుటైము జాబ్ చేసింది సుజాత. తల్లి లేని పిల్లలతో కుస్తీపడుతున్న మోహనును చూస్తుంటే జాలివేసింది సుజాతకు.

'ఏమండీ అనుచితమైనా ఒక్క మాట ...మీరొక్కరూ యింత బాధ్యత నెలా నెట్టుకు రాగలరు? రెండో వివాహము చేసుకోగూడదా?'

నవ్వేశాడు మోహనరావు. 'నిజమేనండీ సుజా' ఏకవచన సంబోధనకు అదిరిపడింది సుజాత. మోహనరావు చెప్పతూనే వున్నాడు, 'నేను మమతను మరువలేక పోతున్నాను. అది రెండవ భార్యను బాధించవచ్చు. రెండవది తనకుకాని యీ పిల్లలను యెంత వరకూ ఆదరించగలదనేదే నన్ను వేధిస్తున్న సమస్యలు.'

'ఆ మీ పిచ్చిగాని — అందరూ ఆలా వుంటారా? అది ఆవిడ సంస్కారము, మంచి మనస్సుబట్టి వుంటుంది. రెండవది ఆవిడ కన్నతల్లిలా చూస్తూ పిల్లలను మందలించినప్పుడు మీరు ఆవిడ నపార్థం చేసుకోకుండా వుండగలగాలి.'

'నిజమేనండీ—కాని మీరన్న సంస్కార హృదయము ఎంతమందికుంటుంది. మొన్న ఓ పెద్దమనిషి సగం ఆస్తి ఆ పిల్లపేర వ్రాసేటట్లయితే తన కూతురు నిస్తానన్నాడు. ఆవిడకు పిల్లలు కలుగవచ్చు... కలగకపోనూవచ్చు...ఆ సంఖ్యనుబట్టి నేను నా పిల్లల కన్యాయం చేసినవాడననా? అందుకనే నిరాకరించాను' ప్యాన్సులో కాఫీ కప్పులలోకి వంపుతూ అన్నాడు మోహన్ రావు.

మోహను భార్య మమత బ్రతికివున్నప్పటినుండి తనకా యింటితో సంబంధము వున్నది. తనకు వచ్చిన స్వరూపాన్ని దేవినో మోహనులో వూహించుకుంటూ తిరుగు ముఖం పట్టింది సుజాత.

* * *

సుజాతలో మమతను చూడగల్గిన మోహన్ను ఆమె డియరెస్టు ఫ్రెండు, సహో

ధ్యాయినియయిన శ్యామలవద్దనుండి సుజాత గతాన్నంతా గ్రహించాడు. సుజాత ఆవేదనను, ఆశలను అర్థం చేసుకున్న మోహను తన నిర్ణయాన్ని చెప్పాడు. ఆలోచిస్తానంది సుజాత.

'మరచిపోలేని మమతను కోసం నీలోనైనా చూచి తృప్తి చెందుతాను...'

'మరచిపోలేని మమత ...' మనస్సు చివుక్కుమంది సుజాతకు. నిజమైన ప్రేమంటే అదేనేమో' సరిపెట్టుకుంది సుజాత.

మోహను బుద్ధిమంతుడు. మంచివాడు. తనకు చెందని పిల్లలనంత ప్రేమగా చూస్తుందే— ? మరి తనకు చెందిన మోహను పిల్లలకు తల్లి కాలేదా ? తను తల్లియైనా, కాలేకపోయినా మోహను బిడ్డలు తన పిచ్చి... మోహను బిడ్డలు తన బిడ్డలు కారా. మమత పిల్లలను తన స్వంత పిల్లలలా చూచే సామర్థ్యము, ఓర్పు, ఆత్మస్థైర్యము నిమ్మని భగవంతుని ప్రార్థించింది.

తమది వర్ణాంతర వివాహము. అది చెల్లెలి పెళ్ళి కాటంకమయే పరిస్థితిలో చెల్లెలి పెళ్ళయిన తరువాతే తన వివాహమన్నది. ఆమె నిర్ణయాన్ని విన్న మోహను చాలా సంతోషించాడు. ఆ ఆనందములో సుజాత చేతులు పట్టుకొని వూపేశాడు. చటుక్కున చెయ్యి వెనకకు లాగుకుంది. తెల్లబోయిన మోహను తప్పు తెలుసుకొని నవ్వేశాడు.

'అమ్మగారికి, నాన్నగారికి తెలియజేస్తారా ?' అడిగాడు సుజాతను.

'లేదండి. చెల్లెలి పెళ్ళి కెళ్ళివచ్చేటప్పుడు చెప్పుతాను. ఇష్టమైతే దీవించటానికి రిజిస్ట్రారాఫీసుకు వస్తారు. లేదా నాలుగక్షింతలు వేసి పంపిస్తారు. సరేనా...' సుజాత సమాధానమది.

'సుజా!... నేను చాలా అదృష్టవంతుడను' కుర్చీలోంచి లేస్తూ అన్నాడు.

'ఆ అదృష్టమంతా నాది మోహన్. నా ఆశలు, ఆశయాలూ తెలుసుకొని నా ఆవేదన తీర్చగలవారు భర్తగా లభిస్తున్నారు.'

చిరునవ్వు నవ్వాడు మోహను. రెండు క్షణాలు నిశబ్దంగా గడిచిపోయాయి.

విశ్వాసాన్నిచ్చే నవ్వా వచ్చాయామాటలు.

'ఏ యావో సారీ సుజా నీకు మాతృత్వాన్నిచ్చే అర్హత కోల్పోయాను' అబద్ధాన్ని నిజంలా స్ఫురించేటట్లు చేస్తూ, ముఖములోని భావాలను చదవడానికి పరీక్షగా ఆమెనే చూశాడు.

ఆమె ముఖముతో రంగులేమీ మారలేదు. 'నీకు భార్యనయ్యావంటే, చెప్పకుండానే నీ పిల్లలకు తల్లినవుతాను. ఇంక నేను కోల్పోయినదేమిటి? ఇల్లాలు కావాలనే నా తాపత్రయం తీరుతుంది, అది చాలు యీ జీవితానికి' చాలా గంభీరంగా వచ్చాయీమాటలు.

అతి నిర్మలంగా నవ్వాడు మోహను. 'సుజా...నా సుజా !' మెల్లిగా చేయి నొక్కి మెట్లు దిగాడు మోహను.

సుజాత ఒక నిశ్చయానికి వచ్చినా ఆమె మనస్సు సందిగ్ధావస్థలోనే వున్నది. తన నందరూ ఆక్షేపించవచ్చు. హేళన చేయవచ్చు. అవమానపరచవచ్చు. స్వార్థపరురాలిగా చిత్రీకరించవచ్చు. ఏమైనా తానీ యాలంబనను వదులుకోలేదు—తననందరూ వెలివేసినా సరే ... తను మాత్రం యేమీ తొందరపడలేదు. ఎంతో ఆలోచించింది. ఎందరి సలహాలో తీసుకుంది. తన మొదటి పెళ్ళి యేమాత్రము తనను బాధించజాలదని చెప్పిన మోహనుకు కృతజ్ఞతలు చెప్పుకుంది.

భగవంతుడున్నాడని మొదటిసారి అనుకుంది సుజాత. తన కలలకొక రూపమేర్పరచి, తన యిన్నాళ్ళ ఆవేదనకు ఆనందాన్ని సమకూర్చిన భగవంతుడు 'చాలా మంచివాడు' అనుకుంది సుజాత.

'తనవి అర్థంలేని కోరికలూ, వ్యర్థమైన ఆవేదనా' అంటూ పరిహసించిన వారిని పెళ్ళయిన తరువాత సవాలు చేయాలనుకుంది.

'సుజా...' అనే తీయనిమాట చెవులలో మార్మోగుతుంటే, ఆవేదన అంతరించిన మనస్సుతో భగవంతునికి కృతజ్ఞతాంజలి ఘటిస్తూ నిద్దలోకి ఒరిగింది సుజాత... కాదు సుజా.

'ఓహ్హో...ఒక పురుషునికి అర్ధాంగి... పిల్లలకు తల్లి...' యీ భావనే ఆమెకు జీవం పోసింది. భగవంతునికి అంజలి ఘటించిన సుజాత చేతులు మెల్లగా ఆమె హృదయముపై వ్రాలిపోయాయి. నిదురలో కూడా ఆమె పెదవులు 'ఆవేదన ... మోహన్, ఇల్లాలు' స్పష్టంగా పలుకుతున్నాయి. ●

